టెన్షన్.. టెన్షన్..



కొండనాలుకకు మందు వేస్తే... ఉన్న నాలుక ఊడిందన్న చందంగా ఉంది అక్కడ పరిస్థితి. రైల్వే క్రాసింగ్ వంతెన సమస్య పరిష్కరించడానికి నిర్మించిన రెండు అండర్ పాత్‌వేల పరిస్థితి అలాగే ఉంది. మలుపులు ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహన చోదకులు ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. ఫలితంగా తమకు కొత్త చిక్కులు వచ్చాయని ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అండర్‌పాత్‌వే వద్ద మలుపు తిరగడానికి ఇబ్బంది పడుతున్న వాహనాలు

అగనంపూడి: రైల్వే క్రాసింగ్ వంతెన సమస్య పరిష్కరించేందుకు జీవీఎంసీ 86, 88 వార్డులకు అనుసంధానంగా కాపు జగ్గరాజుపేట, ఫకీర్‌తక్యా మధ్యలో ఏర్పాటు చేసిన రెండు అండర్ పాత్ వంతెనలు ప్రయాణికుల్లో టెన్షన్ రేకెత్తిస్తున్నాయి. వంతెనలు ఇరుగ్గా ఉండడం, దగ్గర దగ్గరగా ఉండడంతో వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. మూడు మీటర్ల అండర్‌పాత్ వంతెన దాటిన వెంటనే రైల్వే మెయిన్ లైన్ క్రాసింగ్ కోసం ఏడాదిన్నర కిందట మరో అండర్ పాత్ వే ఏర్పాటు చేశారు. మొత్తం 12 మీటర్ల వెడల్పులో రెండు మలుపులు, అండర్ పాత్ వంతెన నిర్మించడంతో వచ్చీ పోయే వాహనాలు కనపడని పరిస్థితి. ఐదు మీటర్ల పొడువు, మూడు మీటర్ల వెడల్పులో అండర్ పాత్‌వే వంతెన నిర్మించారు. దీంతో కార్లు, చిన్న వ్యాన్లు, ఆటోలు హారన్లు మోగిస్తూ ఒకరు ఆగిన తర్వాత మరొకరు మాత్రమే వంతెన కిందికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తోడు మలుపులకు ముందు రోడ్డు వాలులో ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు వేయడంతో కార్లు బోనెట్‌లు స్పీడ్ బ్రేకర్లకు తగిలి రాపిడికి అగ్ని నిప్పులు కూడా పడుతున్నాయి. డ్రైవింగ్‌లో నైపుణ్యం లేకపోతే కార్లు స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆగిపోతున్నాయి. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఇబ్బంది పడుతున్నాయి. వీటిని తప్పించుకొని వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. కొంతమంది లారీ డ్రైవర్లు సాహసం చేసి లోపలికి ప్రవేశిస్తే, ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కోవాల్సి వస్తుంది.

ఫ్లైఓవర్ అయితే మేలు

దీనికి ప్రత్యామ్నాయంగా ఫ్లైఓవర్ నిర్మించి ఉంటే ఈ సమస్య ఉండేది కాదని ప్రయాణికులు, స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అండర్‌పాత్ వంతెన నిర్మించిన తర్వాత క్రాసింగ్ గేట్లు ఎత్తివేశారు. గతంలో క్రాసింగ్ గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వీటిని నిర్మించినా ఆశించిన ప్రయోజనం కనపడడం లేదు. పెద్ద వర్షం కురిస్తే ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోవాల్సిందే.

తప్పని కష్టాలు



రెండు వైపులా ఎత్తుగా, వెడల్పుగా వేసిన స్పీడ్ బ్రేకర్లు

కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, దువ్వాడ నుంచి ఎస్‌ఏడీ, షీలానగర్, నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు దూర తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్య తగ్గుతుందనే ఆలోచనతో ఈ మార్గంలో రాకపోకలు రెట్టింపు అయ్యాయి. అలాగే దువ్వాడ వీఎస్ఈజెడ్ ఔట్‌గేటు, విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఎస్టీబీఎల్ వల్ల కొద్ది కాలంగా ఈ మార్గంలో వేలాది కార్లు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయి అండర్ పాత్ వంతెన వద్ద ఇబ్బందులు పడుతున్నారు.దీంతో తమకు కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు.

అనాలోచిత నిర్మాణం



పెద్ద వర్షాలు కురిస్తే అండర్‌పాత్ వంతెన నిండిపోతుంది. ఈ సమయంలో వాహనచోదకులు వెళ్లాలంటే సాహసమే చేయాలి. రెండు వంతెనల మధ్య దూరం తక్కువతో పాటు మలుపులు ఉండడం వల్ల వాహనచోదకులు టెన్షన్‌కు గురవుతున్నారు. హారన్ల మోతతో అండర్‌పాత్ వంతెన మారుమోగుతోంది. ఫుట్ ఓవర్ వంతెన నిర్మించి ఉంటే ఈ ఇబ్బందులు ఉండేవి కావు.

– వాడపల్లి రామచంద్రరాజు, కూర్మన్నపాలెం

భయం.. భయం



ఫకీర్‌తక్యా నుంచి ఎస్టీబీఎల్ వెళ్లాలంటే గతంలో ఒక అండర్‌పాత్ వంతెన ఉండేది. అప్పట్లో బస్సులు కూడా రాకపోకలు సాగించేవి. రెండో అండర్‌పాత్ వంతెన నిర్మించిన తర్వాత క్రాసింగ్ గేటు మూసేయడంతో పాటు రెండు పాత్‌వేల కింది నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తుంది. మరో రైల్వే లైను, ట్రాక్ నిర్మిస్తున్నారు. ఈ సమయంలో అయినా సరైన నిర్ణయం తీసుకొని ఓవర్ వంతెన నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అధికారులు ఆదిశగా ఆలోచించాలి.

– రవి, వడ్లపూడి నిర్వాసితకాలనీ

నంది అవార్డు అందుకున్న కళాకారుడు అప్పారావు



అప్పారావుకు నంది అవార్డు అందిస్తున్న సాహితీవేత్త భాస్కరభట్ల సత్యప్రసాద్‌శర్మ

అగనంపూడి: కళామతల్లి సేవలో తరిస్తున్న ఆర్టీసీ డ్రైవర్ జాజుల అప్పారావు నంది అవార్డు అందుకున్నారు. కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ వేదిక సంయుక్తగా విజయవాడలో ఆదివారం నిర్వహించిన స్వామి వివేకానంద జయంత్యుత్సవాల్లో భాగంగా ఈ అవార్డును అప్పారావుకు బహూకరించారు. స్టీల్‌సిటీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అప్పారావు అగనంపూడి నిర్వాసిత కాలనీ పెదమడకలో నివాసముంటున్నారు. అప్పారావు పౌరాణిక, సాంఘిక నాటకాలతో పాటు వివిధ వాయిద్య పరికరాలను వాయిస్తారు. చిత్రలేఖనంలో మంచి నైపుణ్యం ఉంది. ఈయన చేస్తున్న సేవలను గుర్తించిన సాహితీవేదిక అప్పారావును సకల కళా కోవిదుడు, నంది అవార్డుతో సత్కరించింది. అవార్డును సాహితీవేత్త భాస్కరభట్ల సత్యప్రసాద్‌శర్మ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు.

శంకర్ రెడ్డికి ఆర్థిక సహాయం అందజేత



శంకర్ రెడ్డికి ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామ నాయకులు, స్నేహితులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శంకర్‌రెడ్డి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న విషయం విదితమే. ఆదివారం ఆయనకు తుంగ్లాం గ్రామ నాయకులు, శంకర్ రెడ్డి స్నేహితులు రూ.20,500 ఆర్థిక సాయం అందజేశారు. ఆయన కుటుంబానికి ధైర్యాన్ని కల్పించారు.

క్లుప్తంగా

తిరుమలనగర్‌లో స్వచ్ఛతా హీ సేవా



మహాత్మాగాంధీ పార్కును శుభ్రం చేస్తున్న కాలనీవాసులు

అగనంపూడి: ఎకో వైజాగ్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 87వ వార్డు తిరుమలనగర్‌లోని మహాత్మాగాంధీ ఉద్యానవనంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. పార్క్‌లోని వాకింగ్ ట్రాక్, క్రీడా మైదానం, ఇంకుడుగుంతల్లో చేరిన చెత్త, ఆకులు, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, శ్రీరాములు, కామరాజు, వసంత్‌రెడ్డి, డానియల్ జాన్, విజయ్ కుమార్, రమణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న పైడిరెడ్డి

పెదగంట్యాడ: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని 77వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి అన్నారు. పిట్టవానిపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కర్రి పైడితల్లి ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులను బట్టు పైడిరెడ్డి ఆదివారం పరామర్శించి నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో అప్పలరెడ్డి, వెంకటరెడ్డి, తాతారావు, పైడిరాజు, దేవుడు, తాతరెడ్డి, అప్పలరెడ్డి, చిన్నారావు, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరంలో సాధన శిబిరం



పేద మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి మందిరంలో ఆదివారం స్ఫూర్తి, సాధన శిబిరం నిర్వహించారు. సత్యసాయి 100వ జయంతి వేడుకల్లో భాగంగా అచ్యుతాపురం శారీరక దివ్యాంగుల పాఠశాలకు చెందిన 110 మంది విద్యార్థులకు నారాయణ సేవ (భోజన ప్రసాదం)అందజేశారు. అదే విధంగా స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా యువతకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. స్వయం ఉపాధి కార్యక్రమాల్లో భాగంగా కూర్మన్నపాలేనికి చెందిన వరలక్ష్మికి కుట్టు మిషన్ అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల సాధన శిబిరాల సమన్వయకర్త జి.నారాయణమూర్తి, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త జె. సూర్యనారాయణ, సేవా విభాగం జిల్లా సమన్వయకర్త ఆర్.ఎ.నాయుడు, సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, ఎస్.కె.ఆర్.కె. రాజు, వి.కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



శంకర్రావుకు నగదు అందజేస్తున్న మాజీ సైనికులు అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి తలారి సాయి మహర్షి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఈ విషయం తెలుసుకున్న పలువురు తోచిన రీతిలో సాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అక్కిరెడ్డిపాలేనికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ ప్రతినిధులు విద్యార్థి తల్లిదండ్రులైన తలారి శంకర్రావు దంపతులకు రూ.87,500 అందజేశారు.

- రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న తలారి సాయి మహర్షి కుటుంబానికి అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుల అసోసియేషన్ ప్రతినిధులు రూ.20,500 నగదు అందజేశారు. వీరికి విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బంగారమ్మ తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవత బంగారు మాంబ తీర్థ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. వేకువ జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్ రాజ్, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, నాయకులు జీలకర్ర నాగేంద్ర, బోగాది అప్పారావు, విరోతి రాము, సాలాపు వెంకట్రావు, కృష్ణంరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.



తీర్థమహోత్సవంలో స్టాళ్ల వద్ద కొనుగోలు దారులు

సందడే సందడి

తీర్థమహోత్సవంలో పలు స్టాళ్లు కొలువు తీరాయి. కొనుగోలు దారులతో సందడి నెలకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు గోపిశెట్టి శ్రీనివాసరావు, పల్లెల శ్రీనివాసరావు, గవర వెంకటరమణారావు, గంద్రెడ్డి ప్రకాష్‌రావు, సంద్రాన శ్రీనివాసరావు, గోపిశెట్టి వెంకటరావు, గోపిశెట్టి సోమునాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దైవ కార్యక్రమాలతో గ్రామాలు సుభిక్షం

- రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు
- ఘనంగా ధ్వజస్తంభ, మృత్యుంజయేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన
- తరలివచ్చిన భక్తులు



ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు తదితరులు



సంకటమోచన గణపతికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు



మహా మృత్యుంజయ హోమంలో తిప్పల దేవన్‌రెడ్డి, ఎమిలీ జ్వాలా తదితరులు

పెదగంట్యాడ: గ్రామాల్లో దైవ కార్యక్రమాలు చేయడం వల్ల ఆయా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో వేంచేసియున్న సంకటమోచన గణపతి ఆలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మామిడి రంగనాథ్, రూప, అన్నెపు రవిచంద్ర, సాయి కీర్తి దంపతుల సహకారంతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన, మహా మృత్యుంజయేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రి రాజశేఖర్, మంత్రి శంకరనారాయణ, మంత్రి నరసింహమూర్తి ఆధ్వర్యంలో పండితులు వేదమంత్రాలు, మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య ఈ క్రతువు అట్టహాసంగా నిర్వహించారు. స్వామి వారికి వేకువజామున ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో నడుపూరు ప్రాంతంలో ఆధ్యాత్మిక సందడి కనిపించింది. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, ఎమిలీ జ్వాల దంపతులు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, భూపతిరాజు సుజాత, ఉరుకూటి చందు, నాయకులు గుడివాడ లతీష్, కాతా బాలకృష్ణ, తిరుమలరెడ్డి, కోమటి శ్రీనివాసరావు, తాటికొండ కాశీ, డాక్టర్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ధూమ్‌ధామ్‌గా గాజువాక ఉత్సవ్



గాజువాక ఉత్సవ్‌కు తరలివచ్చిన ప్రజలు

గాజువాక: సీతారామ ఉమారామలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం (గాజువాక ఉత్సవ్) ఆదివారం వైభవంగా జరిగింది. ఆటలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గాజువాక బీసీ రోడ్డులో సందడి నెలకొంది. ఉత్సవాల సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, మహ్మద్ ఇమ్రాన్, ఉత్సవ కమిటీ సభ్యులు మద్ది శంకర్‌రెడ్డి, దొడ్డి రమణ, గోమాడ వాసు, గుణ శ్రీను, ఎలమంచిలి పైడిరాజు, పాలమరిశెట్టి వాసు, పిట్ట ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు గాజువాక వాసులకు కనువిందు చేశాయి.



గాజువాక ఉత్సవ్‌లో స్టాళ్లవద్ద రద్దీ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 10 ఏళ్ల బొబ్బిలి నుంచి లక్ష్మీ నారాయణరావు (55) నాతయ్యపాలెంలోని ఒక అద్దె ఇంట్లో టైలరింగ్ వృత్తి చేసుకుంటూ భార్యతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం రాత్రి వ్యక్తిగత పనిముగించుకుని నాతయ్యపాలెం వైపు క్రాసింగ్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో ఎస్ఏడీ నుంచి గాజువాక వైపు వెళ్తున్న ద్విచక్రవాహన దారుడు లక్ష్మీనారాయణరావును ఢీ కొట్టి వెళ్లిపోయాడు. ప్రమాదంలో తల, కాళ్లకు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

భవిష్యత్తు సోలార్ పవర్‌దే

ఎంపీ గొల్ల బాబూరావు



సోలార్ పవర్ ప్యానెల్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు

గాజువాక: భవిష్యత్‌లో సోలార్ పవర్ కీలకంగా మారుతుందని రాజ్యసభ సభ్యుడు, సోలార్ పవర్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్ది శంకర్‌రెడ్డి తన ఇంటిపై ఏర్పాటు చేసిన 5కేవీ సోలార్ పవర్ సిస్టమ్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ పథకంతో విద్యుత్ కష్టాలు తీరుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ప్రతి ఇంటి కప్పుపై అమర్చుతామన్నారు. ఇతరులు ఈ పవర్‌ను ఏర్పాటు చేసుకుంటే రూ.78వేలు సబ్సిడీ ఇస్తారన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డబ్బులు ఎక్కువగా ఖర్చు లేకుండా ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, చెంగల వెంకటరావు, నాయకులు రవిరాజ్, గుడివాడ లతీష్, మంత్రి రాజశేఖర్, బాష తదితరులు పాల్గొన్నారు.

జీవకోటి మనుగడకు చిత్తడి నేలలు అవసరం



మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థులు

అగనంపూడి: జీవకోటి మనుగడకు చిత్తడి నేలలను కాపాడుకోవాలని ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు, లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అన్నారు. చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించి కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి వనరులు, మంచినీటి శుద్ధి కోసం చిత్తడి నేలలు అవసరం చాలా ఉందన్నారు. చిత్తడి నేలలకు భూ ఉపరితం నుంచి వ్యర్థాలను వడపోసి, నీటిని పరిశుభ్రం చేసే శక్తి ఉంటుందని తెలిపారు. చిత్తడి నేలలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ బి.అన్నాజీరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1990–91లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమేశనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొంటూ సందడిగా గడిపారు. 34 ఏళ్ల కిందట కలిసి చదువుకున్న వారవతా కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని దాని ద్వారా తమ మిత్రుల కష్ట సుఖాలను తెలుసుకొంటున్నామని, అవసరమైనవారికి సహాయపడుతున్నామని చెప్పారు. అనంతరం హౌసీ, కబడ్డీ, మ్యూజికల్ చైర్ వంటి ఆటలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు కరణంరెడ్డి నర్సింగరావు, నర్సింగ్, చట్టి గోపి, బాలా కుమార్, మోహన్, కృష్ణారెడ్డి, నూకరాజు, శంకర్, కృష్ణ, సతీష్, రబ్బాని, ఫాతిమా, లక్ష్మి, తిరుపతి, శ్రీను, శైలజ పాల్గొన్నారు.